
www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 29 అక్టోబర్ 2024
5



అనుమతుల్లేని దుకాణాలపై చర్యలు

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం, కొత్తపేట

దీపావళి పండగ నేపథ్యంలో బాణసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి అని, అనుమతుల్లేకుండా బాణసంచా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండపేట రూరల్ సిఐ దొర రాజు అన్నారు. సోమవారం అంగర పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ రవి కుమార్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మందుగుండు సామగ్రి తయారీ కేంద్రాలు, నిల్వ చేసే గొడౌన్‌లు, అమ్మకాలు సాగించే దుకాణదారులకు అనుమతులు తప్పనిసరిగా ఉండాలన్నారు.

కొత్తపేట బాణసంచా దుకాణదారులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని డిఎస్‌పి గోవిందరావు అన్నారు. ఆయన ఆదేశాల మేరకు సోమవారం రావులపాలెం రూరల్ సిఐ విద్యాసాగర్ కొత్తపేటలో పోలీసులు దుకాణాలను తనిఖీ చేశారు. ఎస్ఐ ఇ.సురేంద్ర సిబ్బంది ఉన్నారు.

చేపలకు పిల్లులు, కుక్కల మేత

ఆక్వా పరిశ్రమను కలుషితం చేస్తున్న వైనం

ప్రజాశక్తి-కాట్రేనికోన

చేపల పెంపకంలో అధిక దిగుబడులే లక్ష్యంగా చేపల రైతులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ కుక్కలు, పిల్లులకు పెట్టే మేతను చేపలకు ఆహారంగా అందిస్తున్నారు. ఆక్వా సాగును కొందరు రైతులు కలుషితం చేస్తున్నారు. మత్స్యశాఖ అధికారులు పర్యవేక్షణ లేక పిల్లులు, కుక్కలకు మాత్రమే పెట్టే మేతను చేపలకు ఆహారంగా అందిస్తున్నారు. మత్స్య పరిశ్రమలో చేపలు, రొయ్యల చెరువులు, హేచరీలకు సీడ్, ఫీడ్, మందులు వినియోగంపై ఆప్సడా(ఎపిఎస్ఎడిఎ), సిఎఎ అనుమతి తప్పక ఉండాలి. ఆప్సడా నిబంధనల ప్రకారం ఆక్వా గ్రేడ్ మేతలు, మందులను మాత్రమే చేపలు, రొయ్యల సాగుకు వాడవలసి ఉంది. ఆక్వా గ్రేడ్ అనుమతులు లేని అనేక రకాల లోకల్ మేతలను చేపలకు వాడుతున్నారు. ఆక్వా పరిశ్రమలో క్షేత్ర స్థాయిలో మత్స్యశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే కొందరు రైతులు బరి తెగించి పిల్లులు, కుక్కలకు అందించే మేతను చేపలకు వినియోగిస్తున్నారు.



చేపల చెరువులో కలిపేందుకు సిద్ధంగా ఉంచిన మేత స్టాక్

రూప్‌చంద్ చేపలకు కాలం చెల్లిన మేత

థాయిలాండ్ దేశానికి చెందిన మార్స్ పెట్ కేర్ కంపెనీ, శేబా బ్రాండ్‌లలో చికెన్ ఫ్లేవర్‌తో 75 శాతం ఏనిమల్ సోర్స్ ప్రోటీన్స్



చేపలకు వాడుతున్న పిల్లుల ఆహారం

ఉన్న మేతను పిల్లులు, కుక్కలకు బిస్కెట్ రూపంలో మార్కెట్లో లభిస్తున్నాయి. మాంస కృత్తులు అధికంగా ఉన్న కేట్ ఫీడ్ 1.5 కేజీ ఆన్‌లైన్ మార్కెట్ ధర రూ.1099 ఉంది. క్వాలిటీ లేని థర్డ్ గ్రేడ్ మేతను గడువు ముగిసిన, ముగియనున్న మేత కేజీ రూ.30 నుండి రూ.40లకు బల్క్‌గా దొరుకుతుంది. అధిక మొత్తంలో హోల్‌సేల్‌గా మేతను దిగుమతి చేసుకున్న రైతులు చుట్టు పక్కల రైతులకు అమ్మకాలు చేస్తున్నారనే సమాచారం ఉంది. రూప్‌చంద్ చేపలతో పాటు శీలావతి, బొచ్చు చేపలకు కొంత మంది రైతులు ఈమేతను వాడుతున్నారు. పిల్లులు కుక్కలకు అందిస్తున్న మేతను ఏ జంతువుల మాంసంతో తయారు చేశారో తెలియవలసి ఉంది. చేపలకు ఆహారంగా ఆక్వా గ్రేడ్ మేతను మాత్రమే వాడవలసి ఉన్నా కొందరు రైతులు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు.

వ్యాధులు తక్కువ.. దిగుబడులు ఎక్కువ..

చేపల సాగులో విజృంభిస్తున్న బ్యాక్టీరియా వ్యాధులు, బాహ్య పరాన్న జీవులు సోకడంతో రైతులు నష్టాల బారిన పడుతున్నారు. చేపల సాగులో వ్యాపిస్తున్న వ్యాధులను 100 శాతం యాంటీబయోటిక్స్‌తో నిర్మూలించడం కత్తిమీద సాముగా ఉంది. రూప్ చంద్ జాతి చేపలకు వ్యాధులు తీవ్రత ఆంతంత మాత్రంగానే ఉండటంతో సాగుపై రైతులు మక్కువ చూపిస్తున్నారు. ప్రస్తుతం సాగులో చేసే చేపల సంఖ్యను బట్టి ఆక్సిజన్ స్థాయి పెంచుకొంటే సరిపోతుంది. రూప్ చంద్ రకం చేపలకు మేత సక్రమంగా అందిస్తే 9-10 నెలలకు 1 కేజీ నుంచి 1200 గ్రాములు పెరిగి పంట చేతికి వస్తుంది. చేపలకు పెట్టే దాణా అయితే టన్ను చేపలకు సరాసరి 2.5 టన్నుల మేత ఖర్చు అవుతుంది. రూప్ చంద్ చేప పిల్లలు 4 అంగుళాలు ఉన్న వాటిని చెరువులో వదిలి వాటికి పిల్లలకు కుక్కలు, పిల్లులకు పెట్టే దాణాను ఆహారంగా పెడితే 3-4 నెలల మధ్య కాలంలో పంట చేతికి వస్తుంది. టన్ను చేపల ఉత్పత్తికి టన్ను మేత ఖర్చు అవుతుంది. రూప్ చంద్ చేపలు మార్కెట్లో రూ.90 నుంచి రూ.110లు ధర పలుకుతున్నాయి. శీలావతి, బొచ్చు చేపల కంటే కొంత మేరకు ఎక్కువ ధర పలకడం, పిల్ల మంచిదైతే తక్కువ సమయంలో పంట చేతికి రావడం, అధిక లాభం రావడంతో రైతులు అడ్డదారులు తొక్కుతున్నారు. ఉపలగుప్తం, కాట్రేనికోన మండలాలకు సరిహద్దు ప్రాంతంలో ఈ మేతను వాడి అధిక దిగుబడులు సాధించడంతో 20 ఎకరాలు చేస్తున్న ఒక రైతు సుమారు 70 ఎకరాలలో రూప్ చంద్ చేపలు చెరువులు సాగు చేసేందుకు సిద్ధమవుతున్నాడు. సమీపంలోని రైతులు కూడా వీటి పెంపకంపై ఆసక్తి చూపుతున్నారు.

అనుమతి ఉన్న మేత మాత్రమే వాడాలి

మత్స్యపరిశ్రమలో ఆప్సడా నిబంధనల ప్రకారం ఆక్వా గ్రేడ్ మేతలు, మందులను మాత్రమే చేపలకు, రొయ్యలకు దాణాగా వాడాలి. పిల్లులు, కుక్కలకు వాడే మేతను చేపలకు ఆహారంగా వాడుతున్న రైతులను గుర్తించి, మేతను నాణ్యతను ల్యాబ్‌కు పంపి పరీక్షలు చేయిస్తాము.

-శ్రీనివాస్, మత్స్యశాఖ జెడి.

క్రీడలతో మెరుగైన ఆరోగ్యం

ప్రజాశక్తి-రాజోలు

క్రీడలు క్రీడాకారులకు ఆనందం, ఆరోగ్యంతో పాటు అందరికీ స్ఫూర్తిదాయకంగా ఉంటాయని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అన్నారు. సోమవారం మలికిపురం శ్రీరామా బ్యాడ్మింటన్ అకాడమీలో నిర్వహిస్తున్న 68వ ఎపి అంతర్ జిల్లాల ఎస్‌జిఎఫ్ అండర్ 14, 17 బాలబాలికల బ్యాడ్మింటన్ టోర్నమెంట్, సెలెక్షన్ పోటీలను రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్‌తో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎంఎల్ఎ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించడం ద్వారా బ్యాడ్మింటన్ ఆటపై మరింతమందికి మక్కువ పెరుగుతుందన్నారు. చిన్నతనం నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చునని, క్రీడా పోటీల్లో ప్రతి ఒక్కరూ గెలుపోటములను పట్టించుకోకుండా క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. క్రీడల్లో ముందుకు సాగాలంటే సాధనే ముఖ్యమని తెలిపారు.



టోర్నమెంట్‌ను ప్రారంబిస్తున్న ఎంఎల్ఎ వరప్రసాద్, కలెక్టర్ మహేష్

త్వరితగతిన అర్జీల పరిష్కారం

ప్రజాశక్తి-అమలాపురం

ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలకు సంబంధించి వ్యక్తిగత, సామాజిక స్థాయిల్లో ఎదురయ్యే సమస్యలకు మరింత నాణ్యతతో పరిష్కారం చూపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి జిల్లా స్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి భవనంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమాన్ని జెసి అధ్యక్షతన నిర్వహించారు. అర్జీదారుల నంఉచి జెసి నిశాంతి, డిఆర్ఓ ఎం వెంకటేశ్వర్లు, ఎస్ఎస్ఎ ఎపిసి మధుసూదన రావు, ఐసిడిఎస్ పీడీ ఎం ఝాన్సీరాణి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జెసి నిశాంతి మాట్లాడుతూ పౌరుల ఫిర్యాదులన్నింటినీ కేంద్రీకృత పద్ధతిలో సేకరించి, వాటిని మిషన్ మోడ్‌లో పరిష్కరించ డానికి ప్రభుత్వం చురుకైన చొరవ చూపుతోందన్నారు. జిల్లాస్థాయి అధికారులు తమ లాగిన్‌కు వచ్చిన అర్జీలను రోజు వారీగా పరిశీలన చేస్తూ తమకు సంబంధించిన అర్జీలపై గడువులోగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, గడువు దాటిన అర్జీలు లేకుండా రీ ఓపెన్‌కు ఆస్కారం లేకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని చెప్పారు. కొన్ని శాఖల జిల్లాస్థాయి అధికారులు ఉమ్మడి జిల్లా కేంద్రం కాకినాడ నుంచి తదుపరి అధికారులను మీకోసం కార్యక్రమానికి పంపిస్తుందని తెలిపారు.



అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి



ప్రతిజ్ఞ చేయిస్తున్న మేనేజర్ అజయ్

అవినీతిని అంతమొందించాలి

ప్రజాశక్తి - ఆలమూరు

సమాజంలో అవినీతి మర్రి ఊడల్లా పాతుకుపోయిందని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతలా స్వీకరించి కూకటి వేళ్ళతో అంతమొందించాలని యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ వై.అజయ్ ప్రభు కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని జొన్నాడ యూనియన్ బ్యాంక్ ఖాతాదారులతో బ్రాంచ్ కార్యాలయంలో అవినీతిని నిర్మూలిస్తామంటూ సోమవారం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ మన దేశ ఆర్థిక, రాజకీయ, సామాజిక పురోగతికి అవినీతి ఒక ప్రధాన అవరోధమని, ప్రభుత్వం, పౌరులు, ప్రైవేటు రంగం అందరూ అవినీతి నిర్మూలనకు కలసికట్టుగా కృషి చేయాలన్నారు. ప్రతి పౌరుడూ అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తూ అన్ని సమయాల్లోనూ నీతి, సమగ్రతల అత్యున్నత ప్రమాణాలను పాటిస్తూ, అవినీతి వ్యతిరేక పోరాటానికి తప్పకుండా మద్దతు ఇవ్వాలన్నారు. అనంతరం బ్రాంచ్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ క్యాషియర్ దేవిశ్రీ సత్య, భారత్, శాంతి, మస్తాన్, రామారెడ్డి, తమలంపూడి ఈశ్వరరెడ్డి, సత్తి తమ్మిరెడ్డి, మాజీ సర్పంచ్ చాపల రుతియ్య, పలువురు ఖాతాదారులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఓఎన్‌జిసిలో స్థానికులకు ఉపాధి కల్పించాలి

ప్రజాశక్తి-అమలాపురం

ఓఎన్‌జిసి సంస్థ నిర్వహిస్తున్న సర్వేలో గత 30 ఏళ్లుగా అనుభవం ఉన్న స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా ఇతర రాష్ట్రాల నుండి కార్మికులను అతి తక్కువ జీతాలకు దిగుమతి చేసుకుంటున్నారని ఓఎన్‌జిసి నేషనల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఎంపీ గంటి హరీష్ బాలయోగిని కలిసి వినతి పత్రం అందించారు. సర్వే చేస్తున్న సంస్థలు కాంట్రాక్టర్లు స్థానికుల పట్ల వివక్ష చూపుతూ తమ శ్రమను దోపిడీ చేస్తున్నారని తెలిపారు. అతి తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యూనియన్ పెట్టుకున్నామనే నెపంతో తమకు ఉపాధి కల్పించకుండా అన్యాయం చేస్తున్నారని వాపోయారు. పని కల్పించిన వేళలో రోజుకు 12 గంటల పైగా పని చేయించుకుని రోజుకు 400 మాత్రమే ఇచ్చేవారిని ఆ క్రమంలో తమకు భద్రత కూడా కల్పించకుండా ప్రమాదాల అంచున పని చేయించుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, బిఎస్‌పి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొలమూరి మోహన్ బాబు, యూనియన్ జిల్లా అధ్యక్షులు తాళ్ల బబ్జి, కార్యదర్శి అయితాబత్తుల బాబులు, నామాడి ఆనంద్ కుమార్, బొక్కా రమేష్, బడుగు సత్యనారాయణ, గడ్డం బాబూరావు, జనుపల్లి రవీంద్ర, పెయ్యల రమణ, జల్లి నాగరాజు, జనుపల్లి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.




ఎంపీ హరీష్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

ఆధునికీకరణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఉప్పలగుప్తం ప్రధాన పంట కాలువలో తూడు చెత్తాచెదారాలు పెరిగిపోయి రైతులు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఈ విషయమై పంట కాలువ ఆధునీకరణకు వినతి పేరిట సోమవారం ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. పంట కాలువ అనునీకరించే పనులను సోమవారం అధికారులు చేపట్టారు. ప్రస్తుతం కూలీలతో పంట కాలువ అభివద్ధి పనులు చేపట్టామని పూర్తిస్థాయిలో పంట కాలువను ఆధునికరిస్తామని అవసరమైన చోట జెసిబి లను ఉపయోగించి రైతులకు ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తామని ఇరిగేషన్ ఎఇ ఎస్‌వివిఎన్.పవన్ కుమార్ తెలిపారు.



పంట కాలువలో చేపట్టిన ఆధునికీకరణ పనులు

డ్రైవర్‌కు న్యాయం చేయాలని ధర్నా

ప్రజాశక్తి-అమలాపురం

అన్యాయంగా తొలగించిన అంబులెన్స్ డ్రైవర్‌కు న్యాయం చేయాలని దళిత ప్రజాసంఘాల ఆధ్వర్యాన సోమవారం ధర్నా నిర్వహించారు. పట్టణంలోని మద్దాలవారి పేటలో ఓఎన్‌జిసి అధికారుల నివాసానికి సైట్ ఉంది. దీనిలో నాలుగేళ్లుగా దళిత యువకుడు కారెం వెంకటేశ్వరరావు అంబులెన్స్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. వారం రోజుల క్రితం సైట్‌లో నివాసం ఉంటూ గోపవరం జిఎంఎ సైట్‌లో పని చేస్తున్న రెసిడెంట్ ఇంజనీర్ రవీంద్ర నునావత్ వెంకటేశ్వరరావు దగ్గరకు సెక్యూరిటీ సిబ్బందితో వచ్చి ఎలాంటి కారణం లేకుండా దుర్భాషలాడుతూ అక్రమంగా విధుల నుంచి తొలగించారు. దీనిపై దళిత యువకుని న్యాయం చేయాలని ధర్నా చేపట్టారు. దీంతో ఓఎన్‌జిసి అధికారులు ఆందోళన కారులతో చర్చలు జరిపారు. డ్రైవర్‌ను విధుల్లోకి తీసుకుంటామని, ప్రజాప్రతినిధులపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన రవీంద్ర నునావత్‌పై చర్యలు తీసుకుంటామని చెప్పడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో దళిత ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి ఇసుక పట్ల రఘుబాబు, లింగోలు పండు, డాక్టర్ కొప్పుల నాగ మానస, అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, రేవు తిరుపతిరావు, పొలమూరి మోహన్‌బాబు, కౌన్సిలర్ నాగవరపు వెంకటేశ్వరరావు, సిపిఎం జిల్లా కన్వీనర్ కారం వెంకటేశ్వరరావు, గల్లా మీనా కుమారి, గూటం సాయి, నాగవరపు శ్రీను, మాకే సిద్దు, ఉబ్బన శ్రీను, పరమట సింగ్, పినిపే శ్రీను, కారం బేబీ కుమారి పాల్గొన్నారు.

సమస్యలపై పారిశుధ్య కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-మండపేట, ముమ్మిడివరం, రామచంద్రపురం

మున్సిపాలిటీలు, పట్టణాల విస్తరణకు తగినట్టు పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచాలని సిఐటియు జిల్లా కోశాధికారి కె.కృష్ణవేణి డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో మండపేట మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో కృష్ణవేణి మాట్లాడారు. అనేక మున్సిపాలిటీల్లో కొత్తగా కాలనీలు ఏర్పడ్డా యని, పట్ట ణాల విస్తరణ పెరిగిందని వీటికి తగినంత మంది పారిశుధ్య కార్మికుల సంఖ్య పెంచాలని, చనిపో యిన కార్మికుల కుటుంబ సభ్యులకు డెత్ బెనిఫిట్ ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, సబ్బులు, నూనెలు యూనిఫామ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మున్సిపల్ నాయకులు కొమరపు నరేంద్ర కుమార్, బంగారు కొండ, పెందుర్తి లోవరాజు, పెట్టా శ్రీను, చిరంజీవి, రాజు, చిన్న, గణేష్, అమ్ములు, సన్యాసమ్మ హరికృష్ణ పాల్గొన్నారు.

ముమ్మిడివరంలో పెట్టా శివ ప్రసాద్ అధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్, ఇన్‌ఛార్జ్ కమిషనర్ పివి.సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నిమ్మకాయల వెంకటేష్, ఎన్.అరుణ్ కుమార్, వై.వెంకటరమణ, ఎ.సత్తిబాబు, కె.జార్జ్, వి.వెంకటేశ్వర్లు, కె.గోవిందరాజు, కేశవ ప్రసాద్, వెంకటేశ్వరరావు, అరుణ ప్రదీప్ పాల్గొన్నారు.

రామచంద్రపురం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. నూకల బలరామ్ మాట్లాడారు. యూనియన్ నాయకులు బాబూరావు, సుబ్బారావు, గుత్తుల తాతారావు, నరసరాజు, వీర్రాజు కార్మికులు పాల్గొన్నారు.



మండపేటలో ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు



ముమ్మిడివరంలో..



రామచంద్రపురంలో..

ఆసుపత్రుల్లో డెలివరీలను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి-రామచంద్రపురం

ప్రభుత్వాసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో డెలివరీలను ప్రోత్సహించాలని ద్రాక్షారామ, వెల్ల ఆరోగ్య కేంద్రాల అభివద్ధి కమిటీ చైర్మన్ ఎంపిపి అంబటి భవానీ సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భవానీ మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను గ్రామస్థాయిలో సక్రమంగా అమలు చేయాలని, హాస్పటల్లో డెలివరీలు జరిగేలా సిబ్బంది వైద్యులు ప్రోత్సహించాలని తెలిపారు. నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్ కమిటీ వెల్ల పిహెచ్‌సికి సర్టిఫికెట్ ఇచ్చినందుకు మెడికల్ ఆఫీసర్లను, స్టాఫ్‌ను అభినందించారు. గ్రామస్థాయిలో అవసరమైన మందులన్నీ సిద్ధం చేసుకోవాలని ఆమె సూచించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ వీరబోయిన సూరిబాబు, తాడిపల్లి గ్రామ సర్పంచ్ పిల్లి అచల రాజేశ్వరి బాలసుబ్రమణ్యం, డాక్టర్ వి.స్వాతి భవాని, డాక్టర్ వివిఎల్ ప్రసన్న, సూపర్వైజర్లు జి.కమల్ శేషు, డి.రాజేశ్వరి పాల్గొన్నారు. ద్రాక్షారామ గ్రామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, వెలంపాలెం సర్పంచ్ టేకుమూడి సుజాత, డాక్టర్ ఎన్ ప్రశాంతి, డాక్టర్ సందీప్ నాయుడు, సూపర్వైజర్ గంగాధర్ పాల్గొన్నారు.



అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొన్న వైద్యులు

ఎల్ఐసిలో మార్పులు తగవు

ప్రజాశక్తి-అమలాపురం

ఎల్ఐసి పాలసీలో అనేక రకాల మార్పుల వల్ల జీవిత బీమా సంస్థ పాలసీదారులకు ఏజెంట్లకు ఇబ్బందికర సమస్యలు ఉత్పన్నమయ్యాయని వెంటనే మార్పులనుఉపసంహరించాలని ఎల్ఐసి యూనియన్ ప్రెసిడెంట్ ఎస్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం అమలాపురం ఎల్ఐసి కార్యాలయం వద్ద కోనసీమ జిల్లాలో ఉన్న ఏజెంట్లు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మంచి పేరున్న జీవిత బీమా సంస్థ పాలసీలకు ఏజెంట్లుగా కొత్త విధానం వల్ల ఇబ్బందులు తలెత్తే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. సోమవారం దేశవ్యాప్తంగా ఉన్న 14 లక్షల మంది ఎల్ఐసి ఏజెంట్లు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు.



శ్రీనురాజు పుట్టినరోజు వేడుకల్లో టిడిపి శ్రేణులు

ఘనంగా శ్రీనురాజు పుట్టినరోజు

ప్రజాశక్తి - అంబాజీపేట

టిడిపి మండల అధ్యక్షులు దంతులూరి శ్రీనురాజు పుట్టినరోజు వేడుకలు సోమవారం పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. కేకును కట్ చేయించి పూలదండలు వేసి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ సీనియర్ నాయకులు వక్కలంక బుల్లియ్య, మండల ప్రధాన కార్యదర్శి గూడాల ఫణి, పుల్లేటికుర్రు సర్పంచ్ జల్లి బాలరాజు, పళ్ల శ్రీను, పితాని కేశవ, కాసా నాగమల్లేశ్వరరావు, చిన్నం విజయారావు, యడ్లపల్లి తుక్కియ్య, యాగన రాము, పళ్ల శ్రీను, గుబ్బల వెంకట రమణ, దాసరి శ్రీనివాసరావు, పితాని ఈశ్వరరావు, దూనబోయిన బాబి, మోర్త సత్తిబాబు, దంతులూరి శ్రీకాంత్ రాజు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

నేరాలు ఘోరాలు

హత్య కేసులో జీవిత ఖైదు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మండలంలో చింతలూరు గ్రామంలో 2014 డిసెంబర్ 29వ తేదీన భార్యా భర్తల మధ్య ఉన్న గొడవలు నేపథ్యంలో కూనిశెట్టి అప్పారావు తన భార్య సుజాతను మెడకు చున్ని బిగించి హత్య చేశాడు. అప్పట్లో ఎస్ఐ రవికుమార్ కేసు నమోదు చేయగా అప్పటి సిఐ జి.సత్యనారాయణ కేసు దర్యాప్తు చేసి ముద్దాయిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో వాదోపవాదనలు విన్న పెద్దాపురం ఏడవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి జి.చంద్రమౌళి సోమవారం ముద్దాయికి జీవిత ఖైదు శిక్షతోపాటు మరో మూడేళ్ళు జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించారు. రూ.1000 చెల్లించని పక్షంలో మరో మూడు నెలలు జైలు శిక్ష విధించినట్లు ప్రత్తిపాడు సిఐ బి.సూర్య అప్పారావు తెలిపారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసి క్యూటర్ పి.మృత్యుంజయరావు ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

విశ్రాంత ఉద్యోగి ఆత్మహత్య

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఏలేశ్వరం ఆర్‌టిసి డిపోలో డ్రైవర్‌గా పనిచేసి అనారోగ్యంతో పదవీ విరమణ పొందిన లింగంపర్తి గ్రామానికి చెందిన డ్రైవర్ ఎల్‌వివి.సత్యనారాయణ ఆత్మహత్య చేసుకుని మృతి చెందారు. ఎస్ఐ ఎన్.రామలింగేశ్వర రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 4 సంవత్సరాల కితం పదవీ విరమణ పొందిన సత్యనారాయణకు సంస్థ నుంచి రావలసిన డబ్బులు రాకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాడు. ఈ నేపథ్యంలోనే సత్యనారాయణ ఆదివారం గడ్డి మందు తాగాడన్నారు. దీంతో కుటుంబ సభ్యులు ఏలేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి కాకినాడ ఆసుపత్రికి తరలించారు. కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సత్యనారాయణ మృతి చెందాడని ఆయన తెలిపారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

ప్రజాశక్తి - గండేపల్లి

మచిలీపట్నం నుంచి విశాఖపట్నం వెళ్తున్న కారు అదుపుతప్పి గండేపల్లి గ్రామంలో జాతీయ రహదారి డివైడర్‌ను ఢీకొంది. సినీ ఫక్కీలో డివైడర్‌ను ఢీకొన్న కారు గాల్లోకి ఎగిరి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తల్లీ, కొడుకులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ శివనాగు సంఘటన స్థలానికి చేరుకుని హైవే మొబైల్ వాహనంలో గాయపడిన వారిని జగ్గంపేట ఆసుపత్రికి తరలించారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని జి.మేడపాడు గ్రామంలో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 21 మందిని అదుపులోకి తీసుకుని రూ.84,200 నగదును, 15 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో జరిగిన ఈ దాడుల్లో సామర్లకోట సిఐ కృష్ణభగవాన్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు. అరెస్టు చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - కోటనందూరు

సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు తుని రూరల్ ఎస్ఐ బి.కృష్ణమాచారి తెలిపారు. తుని రూరల్ మరువాడ గ్రామ శివారులో వాహనాలను తనిఖీ చేస్తుండగా లచ్చిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన కొంకిపూడి వీరబాబు తన బ్యాగులో 10 లీటర్ల నాటు సారాను తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

88 కేజీల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - పిఠాపురం

రూ.1.76 లక్షల విలువ చేసే 88 కేజీల గంజాయిని సోమవారం పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయితోపాటు ఆటో, బైక్‌ను సీజ్ చేశారు. సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ జి.శ్రీనివాస్ ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ముందస్తు సమాచారంతో రాపర్తి జంక్షన్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ క్రమంలో రాపర్తి గ్రామం వైపు నుంచి పల్సర్ మోటార్ సైకిల్‌పై ఒక వ్యక్తి పైలట్‌గా వ్యవహరిస్తూ వస్తుండగా వెనకాల పాసింజర్ ఆటోలో గంజాయి మూటలతో రావడాన్ని గమనించి తనిఖీలు చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో పారిపోయేందుకు ప్రయత్నించిన ఎం.మణికంఠరాజు, జి.మునిరాజు, కె.రాము, ఎం.సన్యాసి రాజు అనే నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 88 కేజీల గంజాయిని, ఆటో, బైక్ స్వాధీనం చేసుకున్నామన్నారు. సదరు గజాయి అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి నుంచి నర్సీపట్నం, రౌతులపూడి, పిఠాపురం మీదుగా కాకినాడకు అక్రమంగా గంజాయి తరలిస్తున్నరన్నారు. ఈ కేసులో ప్రధాన ముద్దాయి కిర్లంపూడి మండలం సింహాద్రిపురం గ్రామానికి చెందిన ఎం.మణికంఠరాజు 2016 సంవత్సరంలో సెంట్రింగ్ పనుల నిమిత్తం చింతపల్లి చుట్టుప్రక్కల ప్రాంతాల్లో పనిచేస్తూ ఉన్న సమయంలో అక్కడ గంజాయి అమ్మేవారితో పరిచయాలు చేసుకుని అక్కడి నుంచి గంజాయిని కొనుగోలు చేసి చుట్టుప్రక్కల ప్రాంతాలలో అమ్ముతూ వ్యాపారం నిర్వహిస్తుండే వాడన్నారు. సదరు వ్యక్తి పై సామర్లకోట రైల్వే పోలీస్ స్టేషన్, గాజువాక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్, ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్లలో గంజాయి కేసులు ఉన్నాయన్నారు. ఆరెస్టు చేసిన నలుగురిని కోర్టులో హాజరు పరుస్తామన్నారు ఎస్ఐ మణికుమార్ పాల్గొన్నారు.

ఎటిఎం చోరీ కేసులో నాలుగేళ్ల జైలు

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టణంలోని స్థానిక చర్చ్ సెంటర్ సమీపంలో ఉన్న డిసిసి బ్యాంకు ఎటిఎం ను ధ్వంసం చేసి చోరీకి పాల్పడిన కేసులో ఓ వ్యక్తికి నాలుగేళ్ల జైలు శిక్ష విధిస్తూ పిఠాపురం జేఎఫ్ సిఎం కోర్ట్ న్యాయమూర్తి ఎం.విజయ రామేశ్వరి సోమవారం తీర్పు చెప్పారు. సెల్ఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... ఈ ఏడాది ఏప్రిల్ 2వ తేదీన ఎటిఎంను బద్దలు కొట్టి రూ.1100 చోరీ చేసినట్లు మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి విచారణ చేపట్టిన అధికారులు అప్పట్లో పట్టణానికి చెందిన పి.సూరిబాబును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. తదుపరి దర్యాప్తు పూర్తిచేసి ఛార్జిషీటు దాఖలు చేశారని, ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ తరపున ఆకుల లీల నాగరోజా వాదనలు వినిపించగా నేరం రుజువు కావడంతో నాలుగేళ్ల జైలు, జరిమానా విధించారు.

రైతుల సమస్య పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-ఆత్రేయపురం

రైతుల భూ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని తహశీల్దారు టి.రాజేశ్వరరావు అన్నారు. సోమవారం మండలంలోని మెర్లపాలెంలో గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు పాల్గొని రైతుల నుండి తమ భూమి సమస్యలు తీర్చాలని 50 అర్జీలను స్వీకరించారు. 15 రోజుల్లో రైతుల సమస్యలు పరిష్కరిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ భాను, మరియు సిబ్బంది పాల్గొన్నారు.



సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న చిర్ల జగ్గిరెడ్డి

సర్పంచ్ కుటుంబానికి జగ్గిరెడ్డి పరామర్శ

ప్రజాశక్తి - ఆలమూరు

పెదపళ్ల సర్పంచ్ ఏడిద సత్య శ్రీమెహర్ ప్రసాద్ మరిది ఏడిద రవికుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను మాజీ ఎంఎల్‌ఎ చిర్ల జగ్గిరెడ్డి వైసిపి పార్టీ శ్రేణులతో కలిసి సోమవారం పరామర్శించారు. ఆయన వెంట కర్రి నాగిరెడ్డి, తమ్మన శ్రీనువాసు, నామాల శ్రీను, గంటా శ్రీను (ల్యాబ్), వెంకన్న, రవిరాజ్, సుబ్బారావు ఉన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ విజయలక్ష్మి

62 'ఉపాధి' పనుల గుర్తింపు

ప్రజాశక్తి - అల్లవరం

బోడసకుర్రులో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అధ్యక్షతన సోమవారం ఉపాధి హామీ పథకం గ్రామసభ నిర్వహించారు. పంచాయితీ పరిధిలో 62 పనులను రూ.కోటి ఇరవై లక్షలతో చేయనున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి దుర్గా శ్రీను, పాలకవర్గ సభ్యులు అడపా శ్రీనివాసరావు, ఐల నాగేశ్వరరావు, మోసిగంటి పద్మ, మండల తెలుగు యువత అధ్యక్షులు ముత్యాల బాబి, జనసేన గ్రామ కమిటీ అధ్యక్షులు రోళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవించిన మహిళ

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని వెలిచేరు గ్రామానికి చెందిన గర్భిణి ఉమా మహేశ్వరి ప్రసవ నొప్పులు అధికం కావడంతో 108 అంబులెన్సు ఫోన్ చేశారు. ఆత్రేయపురం 108 సిబ్బంది హుటాహుటిన వెలిచేరు చేరుకుని రాజమహేంద్రవరం హాస్పిటల్‌కు తీసుకెళ్తుండగా మార్గం మధ్యలో పురిటి నొప్పులు అధికం కావడంతో అంబులెన్సులోనే ఆడబిడ్డను ప్రసవించింది. తల్లీ బిడ్డా క్షేమంగా ఉన్నారు. వారిని వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం హాస్పిటల్‌కు తరలించారు.

30న అమలాపురంలో జాబ్ మేళా

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ప్రముఖ ప్రయివేటు కంపెనీలలో పని చేసేందుకు ఈ నెల 30న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఇ.వసంతలక్ష్మి తెలిపారు. ఆసక్తి గల పురుషులు, మహిళలు తమ సర్టిఫికెట్లు, బయోడేటా జిరాక్స్ కాపీలతో అమలాపురంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో హాజరవ్వాలని తెలిపారు. సహాయం కోసం 8121838392 నెంబరులో సంప్రదించాలి.

స్త్రీనిధి సొమ్ము గల్లంతుపై ఫిర్యాదు

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

అమలాపురం మండలం పాలగుమ్మిలో డ్వాక్రా సంఘ గ్రూపులకు సంబంధించి నగదు దుర్వినియోగంపై సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ సెల్‌లో సర్పంచ్ కుడిపూడి రామలక్ష్మి ఆధ్వర్యాన ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగదు గల్లంతు సంఘటనపై సమగ్ర విచారణ చేసి డ్వాక్రా మహిళా సభ్యులకు తగు న్యాయం చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి పాలగుమ్మి విజయ, ఉప సర్పంచ్ వసంత్ పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల్లో స్వామిని ఊరేగిస్తున్న అర్చకులు, సిబ్బంది, యాత్రికులు

8వ రోజు ఘనంగా బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం 12వ వార్షిక బ్రహ్మోత్సవాలు 8వ రోజు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి వేద పండితులు ఖండవల్లి ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని చూసేందుకు యాత్రికులు క్యూ కట్టారు. దీంతో ఆలయ ప్రాంగణం అంతా కిక్కిరిసిపోయింది. వెంకటేశ్వర స్వామి కల్పవక్ష వాహనంపై విహరించారు. ఆలయ డిసి నల్లం చక్రధర రావు దంపతులు, లొల్ల గ్రామ సర్పంచ్ కాయలు జగన్నాథం దంపతులు, ముదునూరి వెంకటరాజు దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి శ్రీ వెంకటేశ్వర స్వామి కల్కి అలంకరణలో అశ్వవాహనంపై ఆలయ మాడవీధుల్లో విహరించారు.

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం

యు.కొత్తపల్లి : పొన్నాడ పంచాయతీ పరిధిలో ఉన్న పల్లిపేట సమీపంలోని వాగులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ వెంకటేష్ సోమవారం తెలిపారు. ఉప్పుటేరు వాగులో కొట్టుకు వెళ్తున్న మృతదేహన్ని అక్కడి స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో మృతదేహన్ని వెలికి తీసి పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించినట్లు ఆయన తెలిపారు. మృతుని ఒంటిమీద పసుపు, నలుపు గల గడిల చొక్కా, నలుపు రంగు ఫ్యాంటు ధరించి ఉన్నట్లు చెప్పారు. చేతికి స్టీల్ కడియం ఉన్నట్లు తెలిపారు.

బాణసంచా సామగ్రి స్వాధీనం

రాజానగరం : రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధి కొంతమూరులో ఒక ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.2లక్షల విలువైన బాణసంచా సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ మనోహర్ తెలిపిన వివరాల మేరకు బాణసంచా సామగ్రిని ఇళ్ల మధ్య నిల్వ ఉంచినట్టు సమాచారం వచ్చిందన్నారు. ఈ మేరకు సోదాలు నిర్వహించగా నిల్వ ఉంచిన బాణసంచాను సాధీనం చేసుకుని భద్రపరిచి యజమానికి నోటీసు ఇచ్చామన్నారు.

గ్రామ సభలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

గ్రామాల్లో రీ సర్వేపై నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామ సభలను రైతులంతా వినియోగించుకోవాలని గ్రామ సర్పంచ్ కురుపూడి ఉదయశ్రీ రాంబాబు అన్నారు. మండలంలోని నల్లూరు పంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో సోమవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఉదయశ్రీ అధ్యక్షతన జరిగిన సభలో తహశీల్దారు పి.చిన్నారావు పాల్గొని మాట్లాడారు. రీ సర్వేలో పొరపాట్లను సరిదిద్దేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముత్యాల వెంకట్రావు, కార్యదర్శి పి.రమేష్, గ్రామ విఆర్ఒ టి.సత్యనారాయణ పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరుపై కౌన్సిలర్ల ఆగ్రహం

ప్రజాశక్తి-ముమ్మిడివరం



కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న సభ్యులు, అధికారులు

ప్రజా సమస్యలను గుర్తించి, పరిష్కారించే కౌన్సిల్ సమావేశాలకు అధికారులు గైర్హాజరవుతుంటే ప్రజా సమస్యలను ఎవరికి చెప్పకోవాలని కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముమ్మిడివరం నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం సోమవారం చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత 3 అంశాలతో కూడిన అజెండాను ప్రవేశపెట్టారు. ఫ్లోర్ లీడర్ బాలకృష్ణ, 9వ వార్డు కౌన్సిలర్ సతీష్ కుమార్ నగర పంచాయతీలో అనధికార లే అవుట్లపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డెంగ్యూ జ్వరాలపై సర్వే చేయడం లేదని, శాంపిల్స్ సేకరించడం లేదని తెలిపారు. కౌన్సిలర్ బొంతు సత్య శ్రీనివాస్ అవేదన వ్యక్తం చేశారు. అనంతరం సెప్టెంబర్ నెలకు సంబంధించి ఒకటో పద్దు నుంచి రూ.45 లక్షల 8 వేల 663, రెండో పద్దు నుంచి రూ.15 లక్షల 53 వేల 485 ఖర్చులను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ వేటుకూరు బోసు రాజు, ఇన్ ఛార్జ్ కమిషనర్ పివి సుధాకర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రక్తదానంతో మరొకరికి ప్రాణం

ప్రజాశక్తి-కొత్తపేట

రక్తదానం చేస్తే మరో మనిషికి ప్రాణం పోసినట్లేనని కొత్తపేట ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరులను కొనియాడారు. మన భద్రత, రక్షణ కోసం రోజంతా శ్రమించే పోలీసులకు, సిబ్బందికి ప్రజలంతా సహకరించడమే కాక వారికి తగు గౌరవం ఇవ్వాలని సూచించారు. డిఎస్‌పి గోవిందరావు, సిఐ విద్యాసాగర్, ఎస్ఐ సురేంద్ర, డాక్టర్ జి.దుర్గాప్రసాద్, గ్రామ సర్పంచ్ బూసి జయలక్ష్మి భాస్కరరావు, కంఠంశెట్టి శ్రీనివాస్, మాజీ జెడ్‌పిఇసి సభ్యులు ధరణాల రామకృష్ణ, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు కంఠంశెట్టి చంటి, మిద్దే ఆదినారాయణ, చోడపనీడి భాస్కరరావు, మాజీ సర్పంచ్ రెడ్డి తాతాజీ, బీర ఇసాక్, దూనబోయిన ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ సుబ్బారావుకు ఎంఎల్‌ఎ బండారు అభినందన

ప్రజాశక్తి-కొత్తపేట



సుబ్బారావును అభినందిస్తున్న ఎంఎల్‌ఎ బండారు

కవి, అధ్యాపకుడు డాక్టర్ వివివిఎస్.సుబ్బారావు ప్రపంచ కవితోత్సవంలో నాలుగు రికార్డులు సాధించడం అభినందనీయమని కొత్తపేట ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు అన్నారు. శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో ఈ నెల 19, 20 తేదీల్లో తాడేపల్లిగూడెంలో ప్రపంచ తెలుగు సాహితి కళా జాతరలో డాక్టర్ సుబ్బారావు పాల్గొన్నారు. ఆయన రాసిన పండుటాకుల వ్యధ పద్య కవిత గానం, సత్యహరిశ్చంద్ర నాటకంలోని హరిశ్చంద్రుని ఏకపాత్రాభినయంతో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించారు. దీంతో సుబ్బారావును ఘనంగా సత్కరించారు. సుబ్బారావు మరిన్ని ప్రపంచ రికార్డులు సాధించడం ద్వారా నియోజకవర్గానికి మంచి గుర్తింపు తేవాలని ఆకాంక్షించారు. టిడిపి మండల అధ్యక్షుడు కంఠంశెట్టి శ్రీనివాస్, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి, గుబ్బల మూర్తి తదితరులు అభినందనలు తెలిపారు.

అథ్లెటిక్ పోటీలకు నలుగురు ఎంపిక

ప్రజాశక్తి - అంబాజీపేట



పోటీలకు ఎంపికైన పుల్లేటికుర్రు విద్యార్థులు

రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు హైస్కూల్ హెచ్‌ఎం కె.సూర్య కనకదుర్గ, పీడి అందే సూర్యనారాయణ తెలిపారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24, 25 తేదీల్లో రాజమహేంద్రవరంలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో అండర్ 14 విభాగంలో కొప్పిశెట్టి మనోజ్ 400 మీటర్ల పరుగుల పోటీలలో ద్వితీయ స్థానం, 600 మీటర్ల పరుగులో తృతీయ స్థానం, డొల్లా విహాన్ లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానం, 400 మీటర్ల పరుగు తృతీయ స్థానం, అండర్-1 విభాగంలో చీరవరపు జయశ్రీ మూడు కిలోమీటర్లు పరుగు ప్రథమ స్థానం 1500 మీటర్ల పరుగు పోటీలలో తృతీయ స్థానం, సిహెచ్.హర్షవర్ధిని మూడు కిలోమీటర్ల పరుగు పోటీల్లో ద్వితీయ స్థానాల్లో జిల్లా పోటీలకు ఎంపికై నారన్నారు. వారిని సర్పంచ్ జల్లి బాలరాజు, ఎస్‌ఎంసి చైర్ పర్సన్ నూకల రత్నమాల, ఎంపీటీసీ పబ్బినీడి రాంబాబు, ఎంఇఒలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, స్టాఫ్ సెక్రటరీ టి.శివకుమార్, ఉపాధ్యాయులు, గ్రామ నాయకులు, తదితరులు వారిని అభినందించారు.

ప్రజా సమస్యలపై వినతి

రాజోలు : మలికిపురం మండల పరిషత్ కార్యాలంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో పలు ప్రజా సమస్యలపై రాజోలు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మలికిపురం ఎంపిడిఒ ఎన్.బాలాజీకి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రాజోలు పరిరక్షణ సమితి అధ్యక్షుడు నల్లి ప్రసాదరావు, ఉపాధ్యక్షులు కుడుపూడి శివమణి, కార్యదర్శి మంద సత్యనారాయణ, సభ్యులు బూసి జాన్ మోషే, ముత్యాల శ్రీనివాస్ రావు, గెడ్డం బాలరాజు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు భూపతిపాలెం విద్యార్థులు

ప్రజాశక్తి- గోకవరం

భూపతిపాలెం ఎపిఆర్‌ఎస్ పాఠశాల విద్యార్థులు సాఫ్ట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ బి.రవి తెలిపారు. కోనసీమ జిల్లా జి.వేమవరం జడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాలలో నిర్వహించిన ఎస్‌జిఎఫ్ ఆటల పోటీల్లో భాగంగా సోమవారం సాఫ్ట్ బల్ అండర్- 14లో బి.రిషికేశ, ఎం.సాత్విక్, అండర్- 17లో జి.సూర్య, ఎం.షణ్ముఖ శ్రీనివాసులు ఉత్తమ ప్రతిభ చూపారన్నారు. గెలుపొందిన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన పిఇటి సుధను ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అభినందించారు.

వెంకన్న హుండీల ఆదాయం లెక్కింపు

పెరవలి : అన్నవరప్పాడులోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో హుండీల ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. తనిఖీదారు జి.సత్యవరప్రసాద్ పర్యవేక్షణలో లెక్కింపు జరుపగా 32 రోజులకు రూ.2,53,517, అన్నదాన హుండీ ద్వారా రూ.5,073 మొత్తంగా రూ.2,58,590 ఆదాయం సమకూరిందని సత్యవరప్రసాద్ తెలిపారు. ఈ లెక్కింపులో దేవస్థాన కార్యనిర్వహణ అధికారి ఎం.రాధాకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు

నేడు ఓటరు నమోదు

రాజమహేంద్రవరం రూరల్ : ధవళేశ్వరం ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఎంఎల్‌సి ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని నాయకులు తెలిపారు. ఆధార్ కార్డు, ఓటర్ ఐడి, ఒరిజినల్ డిగ్రీ లేదా డిగ్రీ ప్రొవిజినల్ సర్టిఫికెట్ అటెస్టెడ్ కాపీలు, ఒక పాస్‌పోర్టు సైజు ఫోటోను తీసుకొచ్చి ఓటరుగా నమోదు కావొచ్చన్నారు. వర్క్ షాప్ సబ్ డివిజన్ కార్యా లయం వద్ద ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. గ్రాడ్యుయేట్లు అందరూ దీన్ని వినియోగించుకోవాలని సూచించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్

ప్రజాశక్తి - ఆలమూరు



ప్రజా దర్బార్‌లో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ బండారు

ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతిష్టాత్మకంగా ప్రజా దర్బార్ కార్యక్రమం చేపట్టినట్టు ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన ప్రజా దర్బార్ నిర్వహించారు. అధిక సంఖ్యలో ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేందుకు అధికారుల చుట్టూ తిరగనవసరం లేదన్నారు. అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడూ ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకోవడం వారి హక్కుగా భావించాలన్నారు. వ్యయ ప్రయాసలకోర్చి ఎవరి చుట్టూ తిరగకూడదనే దృఢ సంకల్పంతో వారు సులువుగా సంక్షేమ పథకాలను అందిపుచ్చుకునేందకు తమ కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. గత ప్రభుత్వం ఇళ్ల స్థలాల పంపిణీ కార్యక్రమంలో వ్యవహరించి చట్టబద్ధతలేని హామీ పత్రాలను లబ్ధిదారులకు ఇచ్చిందని, ఇందువల్ల ఎంపిడిఒ కె.జాన్ లింకన్, తహశీల్దారు కెజె.ప్రకాష్ బాబు, ఇన్‌ఛార్జి డిఎల్‌పిఒ ఐ.రాజు, సిఐ సిహెచ్.విద్యాసాగర్, పాల్గొన్నారు.

నేరాల నివారణపై విద్యార్థులకు అవగాహన

కాట్రేనికోన : నేరాల నివారణపై విద్యార్థులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాలు సంధర్భంగా హైస్కూల్ విద్యార్థులకు సైబర్ నేరాల నియంత్రిణ మీద వ్యాస రచన పోటీలు నిర్వహించారు. అనంతరం విధ్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ముమ్మిడివరం సిఐ మోహన్ కుమార్ మాట్లాడుతూ మహిళ సంరక్షణ, డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలు, ఆక్సిడెంట్స్, సైబర్ నేరాలు, బాలల మీద లైంగిక వేధింపులు, బాలికల భద్రత గురించి బాల బాలికలకు అవగాహన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అవినాష్, సిబ్బంది, చెయ్యేరు గ్రామ సర్పంచ్ చెల్లి సురేష్ పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి సాయం

ప్రజాశక్తి-రాజోలు

మలికిపురం మండలం పడమటిపాలెంకు చెందిన గోకనబోయిన దుర్గారావుకు ఇంటి నిర్మాణానికి ఎన్‌ఆర్‌ఐ గ్రూపు గ్రూపు సభ్యులు సాయం అందించారు. స్థానిక పెద్దల ద్వారా సోమవారం రూ.25 వేల ఆర్థిక సహాయం అందించారు.

తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన

ప్రజాశక్తి-రామచంద్రపురం

మండలంలోని అన్నాయిపేటలో మహిళలకు తడి చెత్త పొడి చెత్త సేకరణపై సర్పంచ్ పెమ్మిరెడ్డి దొరబాబు ఆధ్వర్యాన సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామంలో పరిశుభ్రత గురించి, ఇంటి శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ వైస్ ఎంపిపి శాఖ బాబి, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.